# ఎవరు మీరు?

సున్నం హనుమంతరావు

"ఏమండోయ్! ఎవరు మీరు...? బయటకు వెళ్తారా; తలుపు వెయ్యాలి?" అనే ప్రశ్న ఊహావీధుల్లో విచ్చలవిడిగా విహరిస్తూన్న ప్రభాకర్ అప్రయత్నంగా ప్రస్తుత ప్రపంచంలోకి యీడ్చుకొచ్చింది. ఆశ్చర్యంతో అతడు గిర్రున వెనక్కు తిరిగాడు. ఎదురుగా నిల్చున్న అందమయిన ఆ అమ్మాయి నల్లని నేత్రాల్లో ప్రతిబింబించాయి, అతని ఆతృతదృక్కులు...ఆ పదునారేండ్ల లావణ్యరాశి అతన్ని సరిగా చూచిందో లేదోగాని, మనవాడుమాత్రం అటూయిటూ చూస్తూ అప్పుడప్పుడుమాత్రం ఒక వోరచూపు ఆమె మీద విసరలేకుండా వుండలేకపోయాడన్నమాట మాత్రం వాస్తవం. ఇదంతా ఒక క్షణంలో జరిగిపోయింది.

"ఏమిటండీ మీరు చూచేది? మీకే చెప్పేది సుమా! నా మాటలు వినవస్తున్నాయో లేవో మీకు. అవతలకి వెళ్లండి యింట్లోనుండి. తలుపు మూయాలి?" అంటూవున్న అమ్మాయి స్వరం అతని చెవుల్లో మరొక్కసారి గింగురుమంది. ఈ సారిమటుకు ఆ సూటిపోటు మాటలు సూదుల్లా అతని హృదయాన్ని గాయపరచాయి...

"ఈ పిల్ల నిజంగా ఎంత చక్కనిది? మృదు మధురంగా వుంది యీమె కోమల కంఠస్వరం!" అంటూ తనలోతాను అనుకున్నట్లూ, కొద్దిగ పెద్దగా ఆమెకు వినపడేలాగు వాక్యాల్ని విసిరివేశాడు అట్లాగే నిల్చొని ప్రభాకర్.

వినిపించనట్లు "ఏంటి మీరనేది?" మరొక ప్రశ్న ఆ అమ్మాయినుండి...

"ఆ. ఏంలేదులెండీ! అదేదో మరోవిషయం..." అన్నాడు ప్రభాకర్ ధీమాగా.

తటపటాయించకుండా బరబరయిచ్చే ప్రత్యుత్తరాల ధాటికి ఆమె మాట్లాడలేక, తలవొంచుకొని ఆ విధంగానే నిల్చుంది కొద్దిసేపు. తరువాత లేనిధైర్యం తెచ్చుకొని "మీకు మూడోసారి చెప్తున్నా! మీరనేది ఏంటో నా కర్థంకావటంలేదు. ఇకనైనా దయచేసి బయటకు నడవండి?" అంటూ తీక్ష్ణంగా చూచిందా బాలిక అతనికేసి.

"ఇటు వినండి దయచేసి! బయట జోరున పెద్దవర్షం కురుస్తున్న సంగతి మీకుకూడా తెలుసుననుకుంటా! వర్షం కొద్దిగా వెలిసే వెళ్తాను. నేనిక్కడ కొద్దిసేపు తల దాచుకుంటే మీకు కలిగే నష్టమేముంది? మీరే చెప్పండి?" అన్నాడకస్మాత్తుగా ముసిముసి నవ్వులు నవ్వుతూ ప్రభాకర్.

"అయితే వర్షానికి నేను కారకురాల్నంటారా? మర్యాదగా అడుగుతున్నా యిసారి, ఇంతకూ మీరు వెళ్తారా?" చురచుర చూస్తూ కోపాన్నభినయించి.

"పోకపోతే యేం చేస్తారూ?" ధైర్యంగా...

"మా అమ్మను పిలుస్తా. ఆమైతే మీకు తగిన శాస్తి చేసి పంపుతుందిలెండి" అని విసుగ్గా మాటల్ని విదలించిందా బాలిక.

"అయ్యో, ఎందుకు మీ సుకుమార శరీరానికంత శ్రమ. అవసరం లేదులెండి పాపం. వర్షం తగ్గగానే వెళ్లిపోతా క్షమించండి."

"అట్లయితే అందాక కదలరన్నమాటేగా?" కోపంతో గర్జించిందామె స్వరం.

---

* ఆనందవాణి

"మీరు ఆవిధంగా అర్థంచేసుకుంటే...అంతే ననుకుంటా" నవ్వుతూ జవాబు.

"ఏంటే అమ్మాయ్ మోహినీ, ఎప్పుడు ఎవరితోనో వొకరితో పోట్లాడుతుంటావ్ ?

"ఏంటా శబ్దవగోల. తలుపువేసి లోపలికి రారాదూ" అంటూ ఆ లావాటి తల్లి తులసెమ్మ కూతురుదగ్గర కొచ్చింది.

జవాబుకు బదులుగా ఆ అమ్మాయి కొద్ది దూరంలో అచ్చట నిల్చున్న అబ్బాయిని వ్రేలు పెట్టి చూపించింది...తల్లికి.

"యేం ఎవరు నీవు?" అంటూ గర్జించిందామె ప్రభాకర్‌ను.

"ఏమండి నేనా ?... నే...ను...తలవని తలంపుగా వర్షంలో చిక్కుపడ్డాను. వాన కొద్దిగా తగ్గగానే వెళ్లాను. కనికరించండి" అని వినయ విధేయలతో బిజినెస్ లైక్‌గా మాట్లాడాడు.

"అబ్బాయ్ ! బయటకు వెళ్లిపో. ఇదేం సత్రమా ? వర్షంలో తడిసేవారు నిల్చోటానికి" దూంధ్ధాం అంది తులసెమ్మ గొంతు పెద్దచేసి.

"మీ హృదయంలో కనికరం శూన్యమా ? తోటిమానవుడు కష్టపడటంచూసి, మీ రానందించడం న్యాయమా? వర్షములో పూర్తిగా తడిస్తే జబ్బుచేస్తే ఎంత అవస్థ పడవలసివస్తుందో, ఆలోచించండి" అన్నాడు ఉద్రేకపూరితంగా ప్రభాకర్.

"నీవు తడిస్తేం, గిడిస్తేనేం. ఏమైతే నాకెందుకు? ఎదురు మాట్లాడకుండా బయటకు నడవయ్యా. ఈ ప్రజారక్షకులమని విర్రవీగే రక్షకభటులు నీబోటి పనిపాటలు లేకుండా తిరుగుతూ శాంతంగా బ్రతికే మాబోటి ప్రజల్ని మోసం చెయటానికి యీ విధంగా అనేక బురకాల్లో తిరిగేవారినెందుకు బంధించగూడదు ? అనవసరంగా ఏపాపమెరుగని అమాయకుల్ని పట్టుకపోతారే. వీరు నిజంగా ప్రజాభక్షకు"లంటూ పెద్ద వాగ్ధోరణితో పోలీసుల తత్వాన్ని తీవ్రంగా విమర్శించింది తులసెమ్మ.

ఈ మాటలకు ప్రభాకర్‌కు కోపంవచ్చింది. "దేశక్షేమానికి కావాల్సింది ప్రజల్ని మీబోటి హృదయంలేని క్రూరులకుత్పాతాలకు గురికాకుండా రక్షించడమే ! అది మన రక్షకభటులు గుర్తిం



చకపోవటం ఎంత శోచనీయం!" అని ఆవేశంగా అన్నాడు.

ఆ మాటలు ఆమె హృదయాన్ని చేయిపెట్టి దేవాయి, అసహ్యభావంతో చురచుర చూచిందా యువకుణ్ణి. పట్టరాని కోపంతో "ఎవరయ్యా రసికశిఖామణి నీవు! నా యింట్లోకి వచ్చి పైగా నన్నే బ్రతిమలాడవలసింది బదులుగా నామీద నీ అధికారం చెలాయిస్తున్నావా ఇక్కడ. పొగరుబోతుగా వదరుతున్నావ్, మట్టు మర్యాద లేకుండా. జాగ్రత్త. మితిమీరావంటే నోటికి తాళం వేయిస్తా" అంటూ చిచ్చుబుడ్డిలా బుస్సుమంది. ఆ కంఠధ్వనిలో సహజ కాఠిన్యం, కరకుదనం పుట్టిస్తున్నాయి. అవి నిజంగా అతనిమీద యుద్ధము ప్రకటించినట్లుగా వున్నాయి.

"నేనేం రసికశిఖామణినిగాను; గాయకశిరోమణినిగాదు. అయితే మీలాంటి రాతి హృదయం కాదు నాది. నేను మిమ్మల్ని మోసం చేయటానికి వచ్చానంటున్నారు మీరు. కాని నిజంగా అమాయకుడను. పరుల కష్టాల్ని పరికించలేని స్వార్థపరులైన మీ కండ్లకు నేనావిధంగానే కనబడ్తానులెండి" అన్నాడు మృదువుగా.

"ఎవరబ్బాయి నీవు? నోటికివచ్చినట్లు మాట్లాడుతున్నావ్" అందామె కనులెర్రజేసి.

"నేనా?...మా నాన్న కొడుకు" అన్నాడు నిర్లక్ష్యంగా.

"అట్లనా!...ఏమిటా నిర్లక్ష్యసమాధానం." అంటూ కొంగు బిగించి చేతులు తిప్పుకుంటూ అతనిని సమీపించిందామె.

"నా జవాబుకి మీరు నొచ్చుకోవలసిన అవసరం అంతగా లేదు. నేను నిజంగా మీకు అనవసరప్రయాస కలిగించాను. క్షమించండి. వర్షం తగ్గింది వెళ్తున్నా. ఇంతవరకు ఏవిధంగానో నిలవటానికి సమ్మతించినందుకు మీకు హృదయపూర్వక సానుభూతి. దయవుంచండి. వెళ్ళొస్తా నమస్తే!" అంటూ బయటకు అడుగువేసాడు. ఇంతలో...

"హలో ప్రభాకర్! నీవిక్కడున్నావా! రా లోపలి"కంటూ గొడుగు ముడుస్తూ, ప్రసాద్ అతన్ని గదిలోకి తీసుకెళ్లాడు.

అకస్మాత్తుగా ఇంతవరకు జరిగిన నాటకంలో నూతనాధ్యాయం ప్రారంభించటం చూచి, తల్లి కూతుళ్లిద్దరు వంటగదిలోకి దూరారు, దీర్ఘ ఆలోచనలో అసలుసంగతి ఏంటో అవగాహనం చేసుకోలేక...

"నీవు పూర్తిగా తడిసిపోయావేమోనని చాలా భయపడ్డాను ప్రభాకర్" అన్నాడు ప్రసాద్. వారిద్దరు కాఫీ త్రాగుతూ ఒక అరగంటసేపు బాతాఖానీ కొట్టారు. ప్రభాకర్ వెంటనే "నా అభ్యంతరం ఏమీ లేదు. శలవు తీసుకుంటూ; కొద్దిరోజుల్లో కలుస్తా. నమస్తే..." అంటూ బయటకు వెళ్లిపోయాడు.

వంటింట్లో వున్న తులసెమ్మ చకచక నడిచవచ్చి భర్తకేసిచూచి "ఎవరండీ ఆ అబ్బాయి. నేను వెళ్ళగొట్టే ఆ కుర్రాణ్ణి ఎంత ధైర్యంగా పిల్చి స్వాగతంయిచ్చి మర్యాదచేసారు? పాపం! మీ అలుసు కనుక్కొనేగా ప్రతివాడు నన్నిట్లా ఆడిస్తుంది" అంది మూతి బిగించి కోపంతో తులసెమ్మ.

"వెళ్ళగొట్టటం దేనికి?" అంటూ పకపక నవ్వుతున్నాడు ప్రసాద్.

"చాల్లెదురూ, మీ పరిహాసం. అసలు నేనడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి" అంది తుల తులసెమ్మ ధీమాగా.

వచ్చే నవ్వును ఆపుకోలేక ప్రసాద్, అసలు విషయం చెప్తా విను అంటూ భార్యతో—

"ఆ అబ్బాయి డాక్టరు రమేష్ కుమారుడు. లా పరీక్ష ప్యాసయ్యి ప్రాక్టీసు పెట్టబోతువున్నాడు. రమేష్‌బాబుతో మాట్లాడి కావలసిన కట్నంతా సెటిల్ చేసుకున్నా. వివాహానికి ముందు వాళ్ళబ్బాయిని, మన మోహినిని, చూట్టానికి పంపుతానన్నాడు. ఈ విషయం మీతో ముందుచెప్పటానికి వర్షానికి క్లబ్బులో చిక్కుపడి సమయానికి రాలేకపోయా నింటికి. కాబట్టి ఇప్పుడైనా తెలిసిందా ఆ పిల్లవాడు మన కాబోయే అల్లుడని..." అన్నాడు.

అ మాటలు వినేకొద్దీ ఆమె ముఖం తెల్లబడి కళావిహీనమైంది. భర్తనోక వింతమృగంలా చూచి "ముందు చెప్పందీ నాకెట్లా తెలుస్తుందా అబ్బాయి వస్తాడని" అంది తులసెమ్మ మనసు నొచ్చుకుంటూ...

వంటింట్లో పొంచి తల్లిదండ్రులు మాట్లాడుకుంటున్న సంభాషణ వింటూన్న మోహిని తల సిగ్గు బరువుతో క్రుంగిపోయింది.

* ఆనందవాణి